సాక్షి శ్రీకాకుళం

గురువారం । 20 । మార్చి । 2025



కేజీబీవీలు పిలుస్తున్నాయ్..!

కేజీబీవీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఈ నెల 22 నుంచి స్వీకరిస్తారు.


- 8లో



రెచ్చిపోయిన పచ్చ తమ్ముడు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. తమకు నచ్చని వాటిని అడ్డు తొలగించుకుంటున్నారు.

- 8లో



న్యూస్‌రీల్

వెనుకబడిన కుటుంబాలకు చేయూత

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన 20 శాతం కుటుంబాలకు చేయూతనిచ్చి ప్రగతి పథం వైపు నడిపించడానికి ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం (పీ–4) అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం పీ–4 కార్యక్రమంపై జరిగిన అభిప్రాయ సేకరణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రవాస ఆంధ్రులను భాగస్వాములను చేసి వారి సహకారంతో వెనుకబడిన కుటుంబాలను ఆదుకుంటామని చెప్పారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సీపీఓ ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమలో చోరీ



రణస్థలం: పైడిభీమవరం పారిశ్రామికవాడలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీ సీటీవో–6 పరిశ్రమలో సుమారు రూ.2 కోట్ల విలువైన ట్యాబ్లెట్ డ్రగ్ కనిపించకపోవడం సంచలనంగా మారింది. జె.ఆర్.పురం పోలీసులు, పరిశ్రమ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 3న పరిశ్రమ ఉన్నత ఉద్యోగులు స్టాక్ తనిఖీ చేయగా టైప్–2 మధుమేహం, కిడ్నీ, గుండెపోటు, ఆస్తమా తదితర వ్యాధులకు సంబంధించిన మెడిసిన్‌లో వినియోగించే సెమాగ్లూటైడ్ అనే పౌడర్ కొంత మొత్తంలో మాయమైనట్లు గుర్తించారు. సుమారు అరకేజీ ఉండే ఈ పౌడర్‌ను పరిశ్రమలో పనిచేసే ఉద్యోగులే గుట్టుచప్పుడు కాకుండా బయటకు పంపేశారని అనుమానిస్తున్నారు. పరిశ్రమ యూనిట్ హెడ్ ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో జె.ఆర్.పురం పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, జిల్లా ఉన్నతాధికారులు రంగంలో దిగి గోప్యంగా దర్యాప్తు చేపట్టారు. 15 రోజులు దర్యాప్తు చేసినా ఫలితం లేకుండా పోయింది. డ్రగ్ నిల్వ ఉండే స్టాక్ రూమ్‌లోనికి 16 మందికి మాత్రమే ప్రవేశం ఉంది. వారి వద్ద మాత్రమే స్టాక్ రూమ్ తెరిచేందుకు కార్డు స్కానింగ్ ఉంది. అయితే అక్కడ సీసీ కెమెరాలు లేకపోవడంతో డ్రగ్ ఎవరదొంగతనం చేశారో గుర్తించడం కష్టతరంగా మారింది. ఈ నెల 18న అర్ధరాత్రి స్టాక్ రూమ్‌తో సంబంధం ఉన్న వివిధ హోదాల్లో పనిచేస్తున్న 16 మంది ఉద్యోగులను అనుమానితులుగా గుర్తించి జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి కేసు నమోదు చేశారు.

సింధూర ఆస్పత్రి కూడలిలో ట్రాఫిక్ కారణంగా నిత్యం ఇలాంటి ప్రమాదాలెన్నో..



డే అండ్ నైట్

TRAFFIC వెరీ టైట్ JAM

- ప్రమాదాలకు కారణమవుతున్న జంక్షన్
- ట్రాఫిక్ పద్మవ్యూహంతో ప్రజల అవస్థలు
- ముప్పు తిప్పలు పెడుతున్న ఆ 'మూడు' మార్గాలు
- ప్రధానంగా వెంటాడుతున్న 'ఏడు'సమస్యలు
- చిన్నపాటి మార్పులతో సమస్యల పరిష్కారం

సాక్షి పరిశీలన

పద్మవ్యూహంలోకి వెళ్లిన అభిమన్యుడు తిరిగి వస్తాడేమో గానీ.. జిల్లా కేంద్రంలోని డేఅండ్‌నైట్ జంక్షన్‌కు రద్దీ వేళ వెళ్లి తప్పించుకోవడం అంత సులువు కాదు. నిన్న కాక మొన్న ఓ నిండు గర్భిణి ఇదే దారిలో ఆర్తనాదాలు చేస్తూ ప్రాణాలు వదిలేసింది. ట్రాఫిక్ రణగొణ ధ్వనులు అలవాటైపోయిన చెవులు ఆ ఆర్తనాదాలను అప్పుడే మర్చిపోయాయి. ఒక శ్మశానం, పక్కనే పెద్ద స్కూల్, పదుల సంఖ్యలో ఆస్పత్రులు, ల్యాబ్‌లు, వందల సంఖ్యలో ప్రయాణికులు, ఆపై ఆటోస్టాండ్.. అన్నీ ఇక్కడే ఉండడంతో ట్రాఫిక్‌కు నిరంతరం ఇబ్బందులు వస్తూనే ఉన్నాయి. అవే కొందరికి ప్రాణాల మీదకు తెస్తున్నాయి. మనసు పెడితే దీనికీ పరిష్కార మార్గాలున్నాయి. – శ్రీకాకుళం క్రైమ్

7

బ్రిడ్జి చివరన కుడివైపు మలుపులో సెయింట్ జోసెఫ్ స్కూల్, శ్మశాన వాటిక, కొన్ని ల్యాబ్‌లు, ఆస్పత్రులు ఉండడంతో ఆ మార్గంలో తీవ్రమైన రద్దీ నెలకొంటోంది. కేవలం 10 నుంచి 12 అడుగుల ఇరుకైన దారిలో ఇటు ద్విచక్రవాహనాలు.. ఆటోలు.. కార్లు రాకపోకలు సాగిస్తుండటంతో అక్కడ ట్రాఫిక్ జామ్ ఏర్పడి.. బ్రిడ్జి నుంచి డే అండ్ నైట్ సిగ్నల్ వరకు వాహనాలు బారులు తీరుతున్నాయి.





బ్రిడ్జి చివరన కుడివైపు మలుపులో సెయింట్ జోసెఫ్ స్కూల్ వైపు పాఠశాల విద్యార్థులు.. మరో వైపు అత్యవసరం వైద్యం కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు.. మరో వైపు అంత్యక్రియలకు హాజరయ్యే వారితో పాటు సాధారణ ప్రజానీకం.. చాలా క్లిష్టమైన పరిస్థితే. గంటల కొద్దీ వాహనాలు నిలిచి చికాకుకు కలిగించే పరిస్థితులు రోజుకీ కో కొల్లలు. దీనిపైన ట్రాఫిక్ వ్యవస్థ.. బాగా స్టడీ చేయాలి. పరిమిత వేళల్లోనైనా సరే వన్ వే ఏర్పాటు చేయాలి. వెళ్లడం వరకు ఓకే గానీ తిరిగి మాత్రం కేఎల్‌నాయుడు ఆస్పత్రి మీదుగా పాత సీఎంఆర్ వెనుక వైపు నుంచి విజయగణపతి ఆలయం చౌరస్తా నుంచి వాహనాలు వెళ్లే విధంగా చూస్తే కొంత సమస్యకు పరిష్కారం దక్కుతుంది.

సమస్య ఇలా.. | ఇలా చేస్తే మేలు

1

కొత్త వంతెన చివరిలో ఆర్టీసీ బస్సుల్ని నిలిపి ప్రయాణికుల్ని దించుతున్న కారణంగా ఇటు నుంచి వెళ్లే వాహనాలు.. అటు నుంచి వచ్చే వాహనాలు బారులు తీరుతున్నాయి.



వంతెన చివరిలో ఆర్టీసీ బస్సుల్ని నిలపడం నివారించాలి. కొంచెం ముందుకు వెళ్లి సిగ్నల్ నుంచి ఎడమ వైపు కట్ అయిన తరువాత పెట్రోల్ బంక్ లోపు బస్సుల్ని ఆపితే కొంత మేలు. లేదంటే సమీపంలోనే కాంప్లెక్స్ ఉంది కాబట్టి నేరుగా అక్కడే ఆపితే ఎలాంటి సమస్యా ఉండదు.

2

కొత్త వంతెన చివరన ఎడమ వైపు సింధూర ఆస్పత్రి నుంచి ఆర్ట్ కళాశాలకు వెళ్లే మార్గం వచ్చే పోయే వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటూ ట్రాఫికర్‌కు కారణమవుతోంది.



సింధూర ఆస్పత్రి నుంచి ఆర్ట్ కళాశాలకు వెళ్లే మార్గం పూర్తి వన్‌వేగా మార్చాలి. అటు నుంచి వాహనాలను మళ్లీ ఈ జంక్షన్‌కు అనుమతించకుండా అంబేడ్కర్ జంక్షన్ నుంచి డే అండ్ నైట్ సిగ్నల్ మీదుగా బ్రిడ్జి వైపు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

3

బ్రిడ్జి నుంచి డే అండ్ నైట్ సిగ్నల్ వరకు మధ్య ప్రాంతంలో ఉన్న ల్యాబ్‌లు, ఆస్పత్రులు ఇతర వ్యాపార సముదాయాలకు వచ్చేవారి వాహనాలు రోడ్డుపైనే నిలిపేయడంతో రోడ్డు మరింత ఇరుకుగా తయారవుతోంది.



ల్యాబ్‌లు, ఆస్పత్రులు ఇతర వ్యాపార సముదాయాలకు సంబంధించి పార్కింగ్ బాధ్యతలను ఆయా యాజమాన్యాలకే అప్పగించాలి. రోడ్డు పక్కన వాహనాల పార్కింగ్ లేకుండా కట్టడి చేయాలి.

4

చిలకపాలెం వైపు వెళ్లే ఆటోలు, విశాఖపట్నం, విజయనగరం వెళ్లే ట్యాక్సీలు ఇదే మార్గంలో రోడ్డుపై ఆపి ప్రయాణికుల్ని ఎక్కించడమూ ట్రాఫికర్‌కు కారణమవుతోంది.



ఆటోలు, ట్యాక్సీలు నిలుపుదల చేయకుండా చూడాలి. వారికీ ప్రత్యామ్నాయం చూపాలి.

5

అలాగే బ్రిడ్జి మీద చేపల అమ్మకాలు జరుగుతుండటంతో కొనుగోలుదారులు వాహనాలు అక్కడే పెట్టడం కూడా జంక్షన్ జామ్‌కు ఓ కారణమే.



బ్రిడ్జి మీద చేపల విక్రయాలు చేసే వారిని ఫాజుల్‌బాగ్ పేట తరువాత నుంచి బ్రిడ్జి ప్రారంభమయ్యే ప్రాంతం వరకు ఎక్కడో ఒకచోట అనుమతిస్తే సగం సమస్య పరిష్కారమవుతుంది.

6

తోపుడుబళ్ల అమ్మకాలు కారణంగా వాహనదారులు బండి దిగకుండానే వారితో బేరసారాలు సాగించడమూ జామ్‌కు ఒక కారణమే.



తోపుడుబళ్ల అమ్మకందారులకు అవగాహన కల్పించి.. ట్రాఫికర్‌కు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని కౌన్సెలింగ్ చేస్తే మేలు.



భయమేస్తోంది..

డే అండ్ నైట్ జంక్షన్‌కు రావాలంటేనే భయం. ఎవరు ఎటువైపు నుంచి వచ్చి గుద్దేస్తారో తెలియని పరిస్థితి. జనాల్లో మార్పు రావాలి. ట్రాఫిక్ కష్టాలకు తెరపడాలి.

– కర్రి తారక్, పెద్దపాడు, శ్రీకాకుళం



మార్పులు అవశ్యం..

ఈ కూడలికి నిత్యం వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఇక్కడ కచ్చితంగా కానిస్టేబుల్‌ను నియమించాలి. వన్ వే లాంటి పరిష్కార మార్గాలు అవశ్యం. ఆ దిశగా ట్రాఫిక్ పోలీసులు శ్రద్ధ కనబర్చాలి.

– విశాలి, అధ్యాపకురాలు, శ్రీకాకుళం

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలి



వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డితో నాయకులు ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, గొర్లె కిరణ్‌కుమార్, పేరాడ తిలక్, అంధవరపు సూరిబాబు

- వైఎస్సార్ సీపీ జిల్లా ముఖ్య నేతలతో వైఎస్ జగన్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై మరింతగా పోరాడాలని వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ముఖ్యనేతలకు ఆదేశించారు. ఇటీవల యువత పోరు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినందుకు బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి, డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సీదిరి అప్పలరాజు, ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె కిరణ్‌కుమార్, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్, కళింగ వైశ్య కుల రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబులను అభినందించారు. కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పార్టీ నేతలు స్పందిస్తున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి నియోజకరవర్గం లోనూ నాయకులంతా కార్యకర్తలకు, పార్టీ అభిమానులకు అండగా ఉండాలని సూచించారు. కార్యకర్తలకు ఎక్కడ ఎటువంటి సమస్య ఉన్నా వెన్నుదన్నుగా నిలబడాలన్నారు.

సునీతకు సెల్యూట్



భారత సంతతి వ్యోమగామి సునీత విలియమ్స్ అంతరిక్షం నుంచి భూమ్మీదకు క్షేమంగా చేరిన సందర్భంగా కంచిలి మండలం బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధ వారం సెల్యూట్ చేసి అభినందనలు తెలిపారు. సునీత విలియమ్స్‌కు సంబంధించిన జీవిత విశేషాలను తొమ్మిదో తరగతి విద్యార్థిని హాసిని సహ విద్యార్థులకు వివరించింది. – కంచిలి

ఇసుక పిచ్చుక



కనుమరుగవుతున్న పిచ్చుకలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందంటూ లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన సైకత శిల్పి తరణి ప్రసాద్ మిశ్రా వంశధార తీరంలో రూపొందించిన సైకత పిచ్చుక ఆకట్టుకుంటోంది. మార్చి 20 అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ఇసుక పిచ్చుకను తీర్చిదిద్దారు. – ఎల్.ఎన్.పేట:

అవయవదానం



చంద్రశేఖర్ (ఫైల్)

శ్రీకాకుళం రూరల్ : రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో బుధవారం అవయవదానం జరిగింది. ఒడిశా రాష్ట్రం రాయగడ బిసంకటక్‌కు చెందిన చంద్రశేఖర్‌నాయక్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో ఈ నెల 15న జెమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు కుమారుడి అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. ఈ మేరకు బుధవారం జెమ్స్ ఆస్పత్రిలో అవయవదానం చేశారు. ఊపిరితిత్తులు హైదరాబాద్ కిమ్స్‌కు, లివర్, కిడ్నీలు విశాఖపట్నం కిమ్స్‌కు చేరవేశారు. ఉద్యోగంలో చేరేందుకు సిద్ధమైన తరుణంలో తమ కుమారుడు మృతిచెందాడని తల్లిదండ్రులు చంద్రనాయక్, పద్మావతినాయక్ విలపించారు. కాగా, జెమ్స్ ఆసుపత్రి యాజమాన్యం, విద్యార్థులు చంద్రశేఖర్‌నాయక్ మృతదేహానికి నివాళులర్పించారు.

అనుమతులు లేకుంటే చర్యలు

టెక్కలి : ప్రభుత్వ నిబంధనల మేరకు గుర్తింపు లేని పాఠశాలలను మూసివేయిస్తామని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమలచైతన్య స్పష్టం చేశారు. నగరంలోని రవీంద్రభారతి పాఠశాలకు అనుమతులు లేవంటూ ఏబీవీపీ విద్యార్థి సంఘం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం పాఠశాలను పరిశీలించారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకుంటామని డీఈఓ వెల్లడించారు.

అష్టోత్తర శత దీపారాధన



శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని పాలకొండ రోడ్డులో విజయగణపతి ఆలయంలో స్వామివారికి బుధవారం అష్టోత్తర శత దీపారాధనలు నిర్వహించారు. అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టీచర్ల సీనియారిటీ జాబితా సిద్ధం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను విద్యాశాఖ రూపొందించింది. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మునిసిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ 'డీఈఓఎస్‌కెఎల్.ఓఆర్జీ' వెబ్‌పోర్టల్‌లో, డీఈఓ కార్యాలయ నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య బుధవారం పేర్కొన్నారు. అభ్యంతరాలను ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా లిఖిత పూర్వకంగా కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు. అభ్యంతరం తెలియజేసే ఉపాధ్యాయుడి పూర్తి పేరు, పదవి, సంబంధిత వివరాలు, ఎంప్లాయి ఐడీ, జాబితాలో తప్పిదం ఎక్కడ ఉందో స్పష్టంగా పేర్కొనాలని డీఈఓ స్పష్టం చేశారు. గడువు తేదీ తర్వాత వచ్చే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవడం జరగదని, ఫిర్యాదుల పరిష్కార కమిటీ అభ్యంతరాలను పరిశీలించి, తుది నిర్ణయం తీసుకుని సంబంధిత హెచ్‌ఎం/ఉపాధ్యాయులకు తెలియజేస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో గానీ, 9000907101, 8555820983 నంబర్లను గానీ సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

కాలువ భూమి సమర్పయామి

- సాగునీటి కాలువపై టీడీపీ నేత కన్ను
- ఆక్రమణకు గురైన ఐదు ఎకరాలు
- భూమి విలువ రూ.రెండు కోట్లు పైమాటే
- యంత్రాలతో చదును చేస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు



లావేరు మండలం బుడతవలస రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు 113/1, 113/2, 113/3, 113/4, 113/5, 113/7 గల ప్రభుత్వ భూమి ఇది. దీన్ని ఒక టీడీపీ నాయకుడు దర్జాగా చదును చేసి ఆక్రమణలకు పాల్పడ్డారు.



లావేరు మండలం తామాడ రెవెన్యూ పరిధిలోని 105 సర్వే నంబర్లలో తాజాగా సాగు చేసిన భూమి ఇది. ఇక్కడ సాగునీటి కాలువ ఉండేది. ఇప్పుడా కాలువను కప్పేసి సమతలంగా చదును చేసేసి కబ్జాకు పాల్పడుతున్నారు. వాస్తవంగా బుడతవలస, తామాడ రెండు పక్కపక్క గ్రామాలు. ఈ రెండు గ్రామాల పరిధిలోని భూములు కలిసే ఉంటాయి. ఈ రెండింటిమధ్య ప్రభుత్వ భూములు, సాగునీటి కాలువలు ఉన్నాయి. వాటిపై టీడీపీ నాయకుడు కన్నుపడింది. పట్టపగలు జేసీబీలు, ట్రాక్టరు డోసెర్లు పెట్టి చదును చేసేస్తున్నాడు. ఇంత జరుగుతున్నా ఏ అధికారీ ఆపే ప్రయత్నం చేయలేదు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎచ్చెర్ల నియోజకవర్గంలో టీడీపీ నాయకుల కన్ను ప్రభుత్వ భూములపై పడింది. ఇప్పటికే ఎచ్చెర్లలో రోజుకొకచోట ఆక్రమణకు పాల్పడుతున్నారు. అవన్నీ ఒక్కొక్కటీ వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పుడా జాబితాలోకి లావేరు మండలం చేరింది. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములతో పాటు సాగునీటి కాలువలను కబ్జా చేసేస్తున్నారు. దానిలో భాగంగా తామాడ, బుడతవలస పంచాయతీల రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ స్థలం, ఇరిగేషన్ కాలువను ఆక్రమించుకునేందుకు చదును చేస్తున్నారు. బుడతవలస రెవెన్యూ పరిధిలోని 113/1, 113/2, 113/3, 113/4, 113/5, 113/7 సర్వే నంబర్లులో ప్రభుత్వ భూమిని, తామాడ రెవెన్యూ పరిధిలో 105 సర్వే నెంబర్‌లో ఉన్న సాగునీటి కాలువను మొత్తం 4 నుంచి 5 ఎకరాల స్థలాన్ని కబ్జా చేయడానికి బుడతవలస గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పూనుకున్నాడు. నెలరోజులుగా చదునుచేసే పనులు ప్రారంభించేశాడు. ప్రొక్లెయిన్, ట్రాక్టర్లు, డోసర్లు ద్వారా ముందుగా బుడతవలస రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ స్థలాన్ని సాగుచేసేశాడు. అంతటితో ఈయన దాహం తీరలేదు. పక్క పంచాయతీ తామాడ రెవెన్యూ పరిధిలోని తిమ్మప్ప చెరువు నుంచి తాతమానుచెరువు, తూటిబంద, పాతరౌతుపేట చెరువులకు కలుపుతూ ఉన్న కాలువను ఆక్రమించుకునేందుకు చదును చేసే పనులు చేపట్టాడు. ఇక్కడ జరుగుతున్న ఆక్రమణలను ప్రశ్నిస్తుంటే.. తన అనుచరులతో కేసులు పెట్టిస్తామని తిరిగి బెదిరిస్తున్నాడు. దీంతో స్థానికులు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. తామాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రౌతు నారాయణరావు ఈ విషయమై జిల్లా కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని విన్నవించారు.



చర్యలు తీసుకోవాలి

లావేరు మండలం బుడతవలస, తామాడ గ్రామాల పరిధిలో ప్రభుత్వ భూములను, సాగునీటి కాలువను సాయి అనే వ్యక్తి ఆక్రమించుకుని చదును చేస్తున్నారు. ఇక్కడ సాగునీటి కాలువ కూడా ఉంది. దీన్ని సైతం కబ్జా చేసి చదును చేస్తున్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి.

– రౌతు నారాయణరావు, తామాడ, లావేరు మండలం

నోటీసులు ఇచ్చాం..

తామాడ, బుడతవలస రెవెన్యూ పరిధిలో ఆక్రమణలు చేపడుతున్నవారికి నోటీసులు ఇచ్చాం. ఆక్రమణలను నిలిపివేయాలని ఆదేశించాం. ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నవారిపై చర్యలు తప్పవు. – జోగారావు, లావేరు తహశీల్దార్

క్లుప్తంగా

జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేయాలి


జేసీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: జిల్లా యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని మాల, రెల్లి, వాటి అనుబంధ కులాల నేతలు కోరారు. ఈ మేరకు జేసీ ఫర్మాన్‌ అహ్మద్‌ ఖాన్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రం యూనిట్‌గా వర్గీకరణ చేస్తే తమకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. అందువలన ఆ ఆలోచనను ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. 2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. 14 ఏళ్ల క్రితం జనాభా లెక్కలను ఎలా పరిగణలోకి తీసుకుంటారని ప్రశ్నించారు. జేసీని కలిసినవారిలో తైక్వాండో శ్రీను, కంఠ వేణు, అర్జి కోటి, అర్జి ఈశ్వరరావు, జలగడుగుల గోవిందరావు, జలగడుగుల శ్రీరామ, గొల్లపల్లి మోహన్‌, అర్జి రామ్మోహన్‌రావు, అర్జి చిన్న, కె.కూర్మారావు, కల్యాణి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అదుపులోకి రాని మంటలు


బూడిదవుతున్న అటవీ సంపద

మందస: మండలంలోని చీపి గ్రామ సమీపంలో ఉన్న రిజర్వ్‌ ఫారెస్ట్‌లో మంగళవారం చెలరేగిన అగ్నికీలలు ఇంకా అదుపులోకి రాలేదు. దీంతో అటవీ ప్రాంతంలోని ఔషధ వనరులు, వన్యప్రాణులు మంటల్లో కాలి బూడిదవుతున్నాయి. బుధవారం నాటికి రుక్కి పర్వత ప్రాంతానికి మంటలు వ్యాపించాయి. అటవీ శాఖ అధికారులు ఈ ప్రమాదంపై స్పందించకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ఎచ్చెర్ల క్యాంపస్‌: ఎచ్చెర్ల మండలంలోని సంతసీతారంపురంలో భార్య గాలి నాగమ్మను అతి కిరాతకంగా హత్యచేసి, ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛందంగా లొంగిపోయిన అప్పలరెడ్డిని జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం బుధవారం అరెస్టు చేశారు. శ్రీకాకుళం కోర్టులో నిందితుడిని హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్‌ విధించారు. దీంతో అతడిని అంపోలు సబ్‌ జైల్‌కు తరలించారు. సోమవారం రాత్రి మద్యం మత్తులో అనుమానంతో భార్యను దారుణంగా కత్తితో నరికాడు. హత్యలో ఒకడికి మాత్రమే ప్రమేయం ఉండడం, నిందితుడు లొంగిపోవడంతో ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అనంతరం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి అరెస్టుకు ఎస్‌ఐలు వి.సందీప్‌కుమార్‌, నక్క కృష్ణారావు సహకరించారు.

గ్రేట్‌ అనిపించారు..!


తనూజ

కవిటి: దేశంలోని పలు ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఎంటెక్‌, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన గ్రాడ్యుయేట్‌ ఆప్టిట్యూడ్‌ టెస్ట్‌ ఇన్‌ ఇంజినీరింగ్‌(గేట్‌)- 2025 ఫలితాల్లో కవిటి మండలం బల్ల ఎర్రగోవిందపుట్టుగకు చెందిన బల్ల తనూజ మెరిసింది. బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో జాతీయ స్థాయిలో 396వ ర్యాంకు కైవసం చేసుకుంది. సాయి తనూజా తండ్రి జానకిరావు సోంపేట మండలంలో జర్నలిస్ట్‌గా పనిచేస్తున్నారు.

సత్తాచాటిన పూజిత


పూజిత

ఎల్‌.ఎన్‌.పేట: మండల పరిషత్‌ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా పనిచేస్తున్న పైడి శ్రీనివాసరావు కుమార్తె పైడి పూజిత గేట్‌–2025లో సత్తా చాటింది. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఆల్‌ ఇండియా స్థాయిలో 25వ ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు. దీంతో ఆమెను పలువురు అభినందించారు.


కొండ వినోద్‌

ఎచ్చెర్ల క్యాంపస్‌: టెక్కలి ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో డిప్యూటేషన్‌పై అధ్యాపకునిగా పనిచేస్తున్న కొండ వినోద్‌ కుమార్‌కు గేట్‌లో ఎలక్ట్రికల్‌ అండ్‌ ఎలక్ట్రానిక్స్‌ ఇంజినీరింగ్‌లో జాతీయ స్థాయిలో 28 ర్యాంకు వచ్చింది. అతను శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాలలో 2012–15 మధ్య పాలిటెక్నిక్‌, అనంతరం టెక్కలి ఐతం ఇంజినీరింగ్‌ కాలేజీలో బీటెక్‌ పూర్తిచేసి పాలిటెక్నిక్‌ అధ్యాపకుడిగా ఎంపికయ్యాడు. జాతీయ విద్యా సంస్థల్లో ఎంటెక్‌ చేయాలన్న ఆకాంక్షతో గేట్‌ రాయగా మంచి ర్యాంకు సాధించాడు. ప్రతిష్టాత్మక ఐఐటీలో ఎంటెక్‌ పూర్తిచేసి, బోధన రంగంలో అత్యున్నత స్థాయికి చేరడమే తన లక్ష్యమన్నారు.

కేజీబీవీలు పిలుస్తున్నాయ్‌..!

- ప్రవేశాలకు నోటిఫికేషన్‌ విడుదల
- 6వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు
- ఈనెల 22 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మొత్తం 2,224 సీట్ల భర్తీకి చర్యలు

శ్రీకాకుళం న్యూకాలనీ:

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ)ల్లో ప్రవేశాలకు వేళయ్యింది. 2025–26 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతిలో, ఇంటర్మీడియట్‌ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సమగ్ర శిక్ష నోటిఫికేషన్‌ విడుదల చేసింది. ఈనెల 22వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఏప్రిల్‌ 11వ తేదీ వరకు గడువు విధించారు. అర్హులైన బాలికలు 6వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలు పొందవచ్చు.

25 కేజీబీవీల్లో ప్రవేశాలు

పునర్విభజన అనంతరం 30 మండలాల శ్రీకాకుళం జిల్లాలో 25 కేజీబీలు ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో బోధించే ఈ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశాలకు ఒక్కొక్క పాఠశాలలో 40 సీట్లను భర్తీ చేయనున్నారు. ఈ లెక్కన 1,000 సీట్లలో ప్రవేశాలు కల్పిస్తారు. అలాగే ఒక్కొక్క కేజీబీవీకి ఒక ఇంటర్‌ కోర్సును కేటాయించడంతో కేజీబీవీకి 40 చొప్పున మొత్తం 1,000 సీట్లను భర్తీ చేస్తారు. అలాగే 7, 8, 9, 12 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను సైతం భర్తీ చేపట్టనున్నారు. ఇందులో 7వ తరగతిలో 34, 8వ తరగతిలో 11, 9వ తరగతిలో 4, 12వ తరగతి ఇంటర్‌ సెకండియర్‌లో 172 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం మీద కొత్త విద్యా సంవత్సరంలో 2,224 సీట్లను భర్తీ చేయనున్నారు. పేద, అనాథ పిల్లలతో పాటు బడిబయట ఉన్న పిల్లలు, డ్రాపౌట్స్‌ (బడి మానేసినవారు), ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్‌) జీవిస్తున్న బాలికలు మాత్రమే దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులు. 6వ తరగతిలో ప్రవేశం కోసం ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదివిన బాలికలై ఉండాలి. అలాగే ఇంటర్‌లో ప్రవేశాలకు టెన్త్‌క్లాస్‌ ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. ఏప్రిల్‌ 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. జ్టిఇ:// ్చఞఞజ్ఠుఖి. ్ఞఛిజటఞ జీ వెబ్‌సైట్‌ ద్వారా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది.


కేజీబీవీలో యోగా సాధనలో నిమగ్నమైన బాలికలు

కేజీబీవీ	అందుబాటులోని కోర్సు
ఆమదాలవలస(తొగ్గవలస)	ఎంపీసీ
బూర్జ(కొల్లివలస)	బైపీసీ
ఎచ్చెర్ల(పొన్నాడ)	ఎంపీసీ
జి.సిగడాం	ఎంపీసీ
గార(శాలిహుండం)	బైపీసీ
హిరమండలం(పాత హిరమండలం)	బైపీసీ
ఇచ్ఛాపురం(బెల్లుపాడ)	సీఈసీ
జలుమూరు	ఎంపీసీ
కంచిలి(జాడుపుడి)	ఎంపీసీ
కవిటి(కొత్తపాలెం)	ఎంపీసీ
కోటబొమ్మాళి(కొత్తపేట)	బైపీసీ
కొత్తూరు(వసప)	ఎంపీసీ
ఎల్‌ఎన్‌పేట	ఎంఎల్‌టీ
లావేరు(మురపాక)	ఎంపీసీ
మందస(జీఆర్‌పురం)	ఎంఎల్‌టీ
మెళియాపుట్టి	బైపీసీ
నందిగాం(మదనాపురం)	ఎంపీసీ
పాతపట్నం(ఇందిరమ్మకాలనీ)	ఎంపీసీ
పోలాకి(గంగివలస)	బైపీసీ
పొందూరు(లోలుగు కాలనీ)	బైపీసీ
రణస్థలం(లంకపేట)	ఎంపీసీ
సంతబొమ్మాళి	ఎంపీసీ
సారవకోట(మెయిన్‌రోడ్‌)	ఎంపీసీ
సోంపేట(రాజాం)	బైపీసీ
శ్రీకాకుళం(సింగుపురం)	ఎంపీసీ

ఇంటర్మీడియట్‌ కోర్సులు

కేజీబీవీల్లో ఇంటర్మీడియట్‌ కోర్సులకు సంబంధించి ఒక్కొక్క చోట ఒక్కో కోర్సును ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. వాటి వివరాలు పరిశీలిస్తే...


సారవకోట కేజీబీవీ

మంచి అవకాశం



కేజీబీవీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్‌ వెలువడింది. ఇందులో ప్రత్యేకంగా బాలికలు చదువుకోవడం గొప్ప అవకాశమని చెప్పాలి. 6వ తరగతి నుంచి ఇంటర్‌ వరకు ఉచిత చదువు, వసతి కల్పిస్తూ ప్రభుత్వం నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందిస్తుంది. స్టేట్‌ ఎస్‌పీడీ, జిల్లా కలెక్టర్‌ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపడతాం.
– డాక్టర్‌ సంపతిరావు శశిభూషణ్‌, సమగ్ర శిక్ష ఏపీసీ, శ్రీకాకుళం

మెరుగైన ఫలితాలు

కేజీబీవీలు 2004లో ప్రారంభమయ్యాయి. అన్ని వసతులు, సదుపాయాలతో కూడిన ఉచిత విద్యను అందిస్తూ ఏటా కార్పొరేట్‌ పాఠశాలలను తలదన్నేవిధంగా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయి. 2018 నుంచి ఇంటర్మీడియట్‌ కోర్సులను కూడా అందిస్తున్నారు. 2018లో జిల్లాలో జి.సిగడాం, కోటబొమ్మాళి కేజీబీవీల్లో ఇంటర్మీడియట్‌ ప్రవేశపెట్టగా, 2019లో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మరో 19 కేజీబీవీల్లో ప్రవేశాలకు గత రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. 2021 నుంచి అన్ని చోట్ల ఇంటర్మీడియట్‌ కోర్సులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది.

విద్యార్థినుల భద్రతకు పెద్దపీట

- కేజీబీవీల్లోకి పురుషులకు ప్రవేశం పూర్తిగా నిషేధం. ఉపాధ్యాయులు (టీజీటీ/ పీజీటీలు) సైతం మహిళలే.
- అలాగే ప్రహరీ, గేటు, వాచ్‌మ్యాన్‌లతో కూడిన రక్షణ, భద్రత ఉంటుంది.
- అధికారుల తనిఖీలు, పరిశీలన నిమిత్తం తప్పిస్తే ఇతరులకు వెళ్లేందుకు అవకాశం లేదు.
- ఎటువంటి ఖర్చు లేకుండా అత్యుత్తమ బోధన, నాణ్యమైన భోజనం, వసతి సదుపాయాలతో కేజీబీవీల్లో సీట్లకు ఎనలేని డిమాండ్‌ ఏర్పడింది.
- మనబడి నాడు–నేడు ద్వారా కేజీబీవీలను సుందరంగా తీర్చిదిద్దారు. అన్ని వసతులు, మౌలిక సదుపాయాలకు తోడు ఐఎఫ్‌పీ ప్యానెల్స్‌ ద్వారా డిజిటల్‌ తరగతులను మరింత చేరువ చేశారు.


ప్రాక్టికల్స్‌ శిక్షణలో పొన్నాడ కేజీబీవీ బాలికలు

- అత్యద్భుతమైన మెనూ, యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్‌, కాస్మోటిక్స్‌ అందిస్తున్నారు.
- సైన్స్‌ ప్రాజెక్టులు, యోగా, క్రీడలు, ఆటపాటలు నిర్విరామంగా ఉంటాయి. నీట్‌, జేఈఈ, ఏపీఈఏపీసెట్‌ వంటి వివిధ పోటీ పరీక్షలకు కూడా విద్యార్థినులను సన్నద్ధం చేస్తున్నారు.
- ప్రభుత్వం అందించాల్సిన తల్లికి వందనం, విద్యాకానుక వంటి పథకాలకు వీరంతా అర్హులు.

హెల్ప్‌లైన్‌ కేంద్రం ఏర్పాటు

కేజీబీవీల్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమయంలో ఏర్పడే సందేహాలు, సమస్యల నివృత్తి కోసం ప్రభుత్వం టోల్‌ఫ్రీ నంబర్‌ 18004258599ను ఏర్పాటు చేసింది. అలాగే జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో హెల్ప్‌లైన్‌కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు లేదా తల్లిదండ్రులు సందేహాల కోసం సమగ్ర శిక్ష జీసీడీవో 94401 12221 నంబర్‌ను సంప్రదించవచ్చని ఏపీసీ డాక్టర్‌ శశిభూషణ్‌ సూచించారు.

గిరిజన ఉత్పత్తులు కొనుగోలు చేయాలి



ప్రజా చైతన్య ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తూరు: గిరిజన ఉత్పత్తులను జీసీసీ కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.గోవిందరావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్నలు కోరారు. మండలంలోని ఇరపాడుగూడ, కొత్తగూడ తదితర గిరిజన గ్రామాల్లో ప్రజా చైతన్య యాత్ర బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గిరిజనుల కోసం ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు విస్మరించిందని విమర్శించారు. గిరిజన సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. గిరిజనుల ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారీల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీసీసీ, అటవీశాఖల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం 21 రకాల గిరిజన ఉత్పత్తులను కొనుగోలు చేయాలని డిమాండ్‌ చేశారు. గిరిజనుల సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్‌లో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాద్‌, గిరిజన సంఘం నేతలు రామారావు, మోఖలింగం, కృష్ణ, రమణ, మోహన్‌, దుర్గారావు పాల్గొన్నారు.

గ్రామ బహిష్కరణలు పునరావృతమైతే కఠిన చర్యలు

- గెద్దలపాడు గ్రామపెద్దలను హెచ్చరించిన ఆర్డీఓ కృష్ణమూర్తి


గ్రామపెద్దలు, బాధితురాలితో సమావేశమైన ఆర్డీఓ కృష్ణమూర్తి

టెక్కలి: గ్రామ బహిష్కరణ సంఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తప్పవని టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి హెచ్చరించారు. సంతబొమ్మాళి మండలం గెద్దలపాడులో ఆశా వర్కర్‌ చంద్రమ్మ కుటుంబాన్ని సామాజిక బహిష్కరణ చేసిన ఘటనపై బుధవారం టెక్కలి ఆర్డీఓ కార్యాలయంలో గ్రామపెద్దలు, యూనియన్‌ నాయకులు, బాధితులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఉద్యోగాల అమ్మకాలు, బలవంతపు రాజీనామాలు చేయించడం, కుటుంబాలను సామాజిక బహిష్కరణ చేయడం వంటి సంఘటనలకు పాల్పడితే తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా బాధితురాలు చంద్రమ్మ, కుటుంబ సభ్యులు కలిసి టెక్కలి డీఎస్పీ డీఎస్‌ఆర్‌వీఎస్‌ఎన్‌.మూర్తికి ఫిర్యాదు చేశారు. తన ఉద్యోగానికి బలవంతంగా రాజీనామా చేయించి ఆ ఉద్యోగాన్ని అమ్మకానికి పెట్టారంటూ ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆందోళన వద్దు.. అండగా ఉంటా..


పొందూరు: ఖాజీపేటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్‌

పొందూరు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారికి అనునిత్యం అండగా ఉంటానని ఆ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్‌ అన్నారు. రాజకీయ కక్షలతో మండలంలోని ఖాజీపేట గ్రామంలో జరిగిన కొట్లాటలో 42 రోజులపాటు రిమాండ్‌లో ఉండి బెయిల్‌పై వచ్చిన బాధితులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు చింతాడ వెంకట సత్యప్రసాద్‌, తమ్మినేని మురళి, బొమ్మాళి గిరి, పైడి నాగభూషణం, సూర ఆనందరావు, పైడి లోకనాథం, సింగూరు తేజేశ్వరరావు, కూటికుప్పల రాజు, కిల్లి సన్యాసిరావు, గురుగుబెల్లి శేఖర్‌ ఉన్నారు.

ఆక్రమణ స్థలం పరిశీలన


ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి ఎఫెక్ట్‌...

కవిటి: మండల కేంద్రంలో ప్రభుత్వ భూమిని టీడీపీ నేత చదును చేయించడంపై సాక్షి పత్రికలో 'చదును ఇదే అదును..!' శీర్షికతో బుధవారం ప్రచురితమైన కథనానికి తహసీల్దార్‌ మురళీమోహనరావు స్పందించారు. ఈ మేరకు మండల సర్వేయర్‌ మల్లికార్జున పాణిగ్రాహి, ఆర్‌ఐ రమణమూర్తి, వీఆర్వో ఎస్‌.నారాయణతో కలిసి సంబంధిత స్థలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ స్థలం చుట్టూ ఉన్న రైతులతో ఆయన మాట్లాడి, వారి అభిప్రాయాలు తీసుకున్నారు. వాస్తవానికి ఇది రోడ్డు పోరంబోకుగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇది ప్రభుత్వ స్థలమని అందువలన చదును చేసిన ఖాళీ స్థలంలో బోర్డులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ స్థలాన్ని అనుమతి లేకుండా ఎలా చదును చేశారని చదును చేయించిన వజ్జ రంగారావును ప్రశ్నించారు. అయితే తన కొబ్బరి తోటకు ఆనుకొని ఉండడంతో వ్యవసాయేతర అవసరాలకు వాడుకునేందుకు చదును చేసినట్లు ఆయన తెలిపారు.

రైలు ఢీకొని ఆవు మృతి


ఆవు మృతదేహాన్ని తొలగిస్తున్న సిబ్బంది

టెక్కలి రూరల్‌: స్థానిక తెంబూర్‌ రోడ్డు జంక్షన్‌ వద్ద ఉన్న రైల్వే గేటు సమీపంలో రైలు ఢీకొని ఆవు మృతి చెందింది. మంగళవారం రాత్రి గుణుపూర్‌ నుంచి నౌపడ వైపు వెళ్లే రాజారాణి ఎక్స్‌ప్రెస్‌ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతి చెందిన ఆవుని బుధవారం జేసీబీ సాయంతో తొలగించి, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు. అయితే మృతి చెందిన ఆవు ఎవరిది అనేది తెలియలేదు.

వైఎస్‌ జగన్‌ను కలిసిన కె.వి.జి.సత్యనారాయణ



వైఎస్సార్‌ సీపీ అధినేత వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ స్థితిగతులపై చర్చించారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు పేర్కొన్నారు.
– శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)

'ఉపాధి'లో వెలుగు చూసిన అక్రమాలు

- రూ.64,446ల రికవరీకి అధికారుల ఆదేశం
- రూ.38,500ల జరిమానా విధింపు


సోషల్‌ ఆడిట్‌ చేపడుతున్న దృశ్యం

కంచిలి: మండలంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన వివిధ రకాల పనుల్లో జరిగిన అక్రమాలు బయటపడ్డాయి. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయం వద్ద గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి జనవరి 30 నుంచి ఫిబ్రవరి 18వ తేదీ వరకు 31 పంచాయతీల పరిధిలో సోషల్‌ ఆడిట్‌ నిర్వహించారు. చివరిగా బుధవారం ఈ నివేదికలు వెల్లడించే ప్రజావేదిక కార్యక్రమాన్ని చేపట్టారు. దీనిలో భాగంగా 31 పంచాయతీల పరిధిలో ఏడాదిపాటు చేపట్టిన వివిధ రకాల పనులకు సంబంధించి నాణ్యత, కొలతలు, వేతనదారులకు అందిన బిల్లులు, హాజరు పట్టిక పరిశీలన, రశీదుల పంపిణీ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో సోషల్‌ ఆడిట్‌ సిబ్బంది సేకరించిన వివరాలను నివేదించారు.

అవకతవకలు బయటకు

ఏడాది కాలంలో ఉపాధి హామీ, హౌసింగ్‌, ఐటీడీఏ, పంచాయతీరాజ్‌, ఆర్‌వీఎం విభాగాల్లో మొత్తంగా 1,783 పనులు చేపట్టారు. వీటికి సంబంధించి సోషల్‌ ఆడిట్‌ చేపట్టిన నేపథ్యంలో జరిగిన అవకతవకలు బయటకు వచ్చాయి. దీంతో ఉపాధి హామీ సిబ్బంది నుంచి రూ.64,446లు రికవరీకి అధికారులు ఆదేశించడంతో పాటు రూ.38,500లు జరిమానాగా విధించారు. మొత్తంగా రూ.1,01,946లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పంచాయతీలవారీగా సోషల్‌ ఆడిట్‌ నివేదికలు చదివిన సందర్భంగా చాలా వరకు పంచాయతీల పరిధిలో ఉపాధిహామీ పనులు చేపట్టినచోట కనీసం మస్టర్లలో హాజరు కూడా సక్రమంగా వేయడం లేదని, వేతనదారుల బిల్స్‌కు సంబంధించి రశీదు పత్రాలు పంపిణీ చేయలేదని పేర్కొన్నారు. హాజరు పట్టికలో సంతకాలు, వేలిముద్రలు కూడా లేవని సోషల్‌ ఆడిట్‌ డీఆర్పీలు నివేదించారు. అంతేకాకుండా మెటీరియల్‌ కాంపోనెంట్‌ పనులకు సంబంధించి పూర్తిగా చేపట్టని నిర్మాణాలకు సైతం బిల్లులు విడుదల చేసినట్లు తెలిపారు. ఉపాధి హామీ పనుల కొలతల్లో కూడా తేడాలు ఉన్నట్లు తెలిపారు. ఇలా అడుగడుగునా పర్యవేక్షణ లోపం, పనుల్లో డొల్లతనం అనేవి ఈ ప్రజావేదిక సాక్షిగా వెల్లడయ్యాయి. సమావేశంలో డ్వామా పీడీ సుధాకరరావు, స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, ఏపీడీ సీహెచ్‌ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో వి.తిరుమలరావు, విజిలెన్స్‌ డీవో స్వరూపారాణి, ఏపీడీ పంచాది రాధ, విజిలెన్స్‌ అధికారి శ్రావణ్‌, ఏపీవో జి.ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు

జి.సిగడాం: మండలంలోని దేవరవలస గ్రామానికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన శిర్రాకిరణ్‌ పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడని బాధితురాలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వై.మధుసూదనరావు తెలిపారు.

దేవరవలసలో అగ్ని ప్రమాదం


అగ్నికి ఆహుతైన ధాన్యం

జి.సిగడాం: మండలంలోని దేవరవలస గ్రామంలో అప్పారావు, అప్పలదాస్‌, సూర్యారావులకు చెందిన సుమారు వంద బస్తాల ధాన్యం కట్టలు, ఐదు ఎకరాల గడ్డివాములు బుధవారం రాత్రి 2 గంటల సమయంలో అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో దాదాపు రూ.3 లక్షల మేరకు నష్టం చేకూరింది. రాత్రి సమయంలో ఎవరైనా దుండగులు నిప్పుపెట్టారేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రెచ్చిపోయిన పచ్చ తమ్ముడు

- రచ్చబండ తొలగింపునకు యత్నం


రచ్చబండను గునపాలతో పెకిలిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్‌: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. తమకు నచ్చనివాటిపై కక్ష పూరితంగా వ్యవహరిస్తూ అడ్డు తొలగించుకుంటున్నారు. మండలంలోని కొత్త శాసనం గ్రామంలో 30 ఏళ్ల క్రితం అప్పటి గ్రామపెద్ద కారంగి కారయ్య అనే వ్యక్తి రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలంలో సొంత నిధులతో రచ్చబండను నిర్మించాడు. రచ్చబండ మధ్యలో రావి చెట్టు, పక్కనే త్రినాథ స్వాములవారి విగ్రహాలను ప్రతిష్టించారు. గ్రామస్తులు వేసవి విడిది చేయడం, సమావేశాలు నిర్వహించడం, బాటసారులు విశ్రాంతి తీసుకోవడం చేస్తున్నారు. అయితే రచ్చబండకు వెనుకన స్థానిక టీడీపీ నాయకుడు ఇసురు ఫకీరుకు చెందిన భూమి ఉంది. దీంతో స్థానిక టీడీపీ నాయకుల ప్రోద్బలంతో తన భార్య జానికమ్మతో కలిసి బుధవారం గునపాలతో రచ్చబండను పెకిలించే ప్రక్రియకు పూనుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అడ్డుకున్నప్పటికీ తమ ప్రభుత్వం అధికారంలో ఉందని, అడ్డుకున్నవారి అంతు చూస్తానంటూ భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో సర్పంచ్‌ కారంగి త్రినాథ్‌రెడ్డి తహసీల్దార్‌కు, రూరల్‌ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశాడు. రచ్చబండ ధ్వంసం చేసిన భాగాలకు మరమ్మతులు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.